క్లుప్తంగా

పెద్దేవంలో ఆక్రమణల తొలగింపు



జేసీబీతో ఆక్రమణల తొలగింపు

తాళ్లపూడి: గ్రామంలో ఆక్రమణలు తొలగించడానికి పంచాయతీ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణలు తెలిపారు. సోమవారం నుంచి గ్రామంలోని 1, 2, 4 వార్డుల్లో రోడ్డు, డ్రెయిన్ నిర్మాణాలకు అడ్డు వచ్చిన ఆక్రమణలను తొలగిస్తున్నట్టు వెల్లడించారు. గతంలో కొన్ని చోట్ల ఆక్రమణలు తొలగించి సీసీ డ్రెయిన్ నిర్మించినట్టు తెలిపారు. గ్రామ అభివృద్ధికి చేపట్టే ఈ పనులకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

19న వీరన్నబాబు సంబరం



వేగేశ్వరపురంలో నూతనంగా నిర్మించిన వీరన్నబాబు గద్దె ఆలయం

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురంలో సుమారు 140 ఏళ్ల చరిత్ర కలిగిన వీరన్నబాబు గద్దె ఆలయ పునర్నిర్మాణం పూర్తి చేశారు. ఈ నెల 19, 20వ తేదీల్లో ఆలయ ప్రతిష్ఠాపన, వీరన్న బాబు సంబరం నిర్వహించనున్నారు. గ్రామస్తులు, దాతల సహకారంతో సుమారు రూ.10 లక్షల వ్యయంతో నూతన ఆలయాన్ని సుందరంగా నిర్మించారు. 19న ఆలయ ప్రతిష్ఠ, హోమం, 20న వీభూదిపళ్లతో గ్రామోత్సవం, వీరన్నబాబు సంబరం, అనంతరం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవం



గోపాలపురం లక్ష్మీ గణపతి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గోపాలపురం: శ్రీరాజరాజేశ్వరి టౌన్ షిప్‌లో నిర్మించిన శ్రీలక్ష్మీగణపతి ఆలయ తృతీయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ జ్యోతి ప్రజ్వలన, కంకణధారణ, బ్రహ్మ కలశపూజ, శ్రీలక్ష్మీ గణపతి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకుడు కంధగిరి గౌతం శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

నిడదవోలు రూరల్: రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రీ నెంబర్ కోసం వివరాలను రైతులు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం, డి.ముప్పవరం గ్రామాల్లో రిజిస్ట్రీ ప్రక్రియపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులంతా పొలం పట్టదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్‌తో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. దీని ద్వారా ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు నంబర్ వస్తుందన్నారు. ఆధార్ కార్డు తరహాలో ప్రతి రైతుకు యూనిక్ ఐడీ ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాలకు ఈ యూనిక్ ఐడీ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు కె.శివనాగు, మాధవస్, రైతులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఉండ్రాజవరం: ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని గ్రామాభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, వైస్ సర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాస్ కోరారు. మండలంలోని వేలివెన్నులో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం డ్వాక్రా మహిళలకు తడి, పొడి చెత్తతో పాటు చెత్త నుంచి సంపద సృష్టిపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి, పనితీరును పరిశీలించారు.

బాబా మందిరంలో సమారాధన

చాగల్లు: స్థానిక షిరిడీ సాయినాథుని మందిర వార్షికోత్సవ వేడుకలు మూడు రోజుల పాటు ఘనంగా జరిగాయి. ఉత్సవాలు సందర్భంగా బాబాకు విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. సోమవారం ఉత్సవాల ముగింపు సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, యువజన సంఘాలు, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

నిషేధమా.. నీవెక్కడ..!

- ప్లాస్టిక్ ఉత్పత్తులతో పర్యావరణానికి పెనుముప్పు
- విచ్చలవిడిగా వినియోగం
- క్షేత్రస్థాయిలో అమలుకాని నిషేధం
- తూతూ మంత్రంగా తనిఖీలు



పట్టణంలో వినియోగిస్తున్న పాలిథిన్ కవర్లు



దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నిడదవోలు : మార్కెట్‌కు ఖాళీ చేతులతో వెళ్లి పాలిథిన్ సంచి నిండా సరకులు తెచ్చుకోవడం.. సరకులు తీసేసి సంచులను విచ్చలవిడిగా బయట పడేయడం ప్రజలకు పరిపాటిగా మారిపోయింది. ఒకప్పుడు బజారుకు వెళితే ఎంచక్కా గుడ్డ సంచో, నార సంచో చేత పట్టుకుని వెళ్లేవారు. మార్కెట్లో కావలసిన సరుకులు కొనుగోలు చేసుకొని ఆ సంచిలో తెచ్చుకునేవారు. అయితే కాలక్రమంలో ప్లాస్టిక్ వాడకం ఎక్కువైంది. పాలిథిన్ బ్యాగులు, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ సంచులు మార్కెట్లో ఇబ్బడిముబ్బడిగా దర్శనమిస్తున్నాయి. దీంతో చేతి సంచుల సంస్కృతి కనుమరుగైంది. ప్రస్తుతం ప్లాస్టిక్ వాడకం రాజ్యమేలుతోంది. అవన్నీ మట్టిలోనూ, డ్రెయిన్‌లలోనూ ఎక్కడ పడితే అక్కడ కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. ఆ వ్యర్థాలు భూమిలోకి చేరడంతో భూమి తన ఉనికిని కోల్పోతుంది. పశువులు వాటిని తిని మృత్యువాత పడుతున్నాయి. భూమి లోపల పాలిథిన్ వ్యర్థాలు పెరిగిపోవడంతో ఉష్ణోగ్రత పెరిగి మానవాళికి పెనుముప్పుగా మారింది. పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ డ్రెయిన్లు, ఖాళీ ప్రదేశాల్లో ప్లాస్టిక్ పేరుకుపోతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణ పరిధిలో ప్లాస్టిక్ వాడకం, అమ్మకం నిషేధం. హోల్‌సేల్, రిటైల్‌గా ప్లాస్టిక్ అమ్మకాలు నిషేధించవలసిందిగా ఎన్నిసార్లు హెచ్చరించినా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం కలుషితమై ప్రాణాంతక వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం పొంచిఉందని సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నా వ్యాపారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలోని వివిధ దుకాణాల్లో తనిఖీలు చేపట్టి రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు అపరాధ రుసుం విధిస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది అక్కడి నుండి వెళ్లగానే మళ్లీ ప్లాస్టిక్ అమ్మకాలను యథావిధిగా కొనసాగిస్తున్నారు. పలు దుకాణాలకు రాజకీయ నాయకుల సిఫార్సులు సైతం ఉండటంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



గణపతి సెంటర్‌లో కల్యాణ మండపం వద్ద డ్రెయిన్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు

క్షేత్రస్థాయిలో విఫలం

ప్లాస్టిక్ నిషేధంపై గతంలో అనేక మార్లు అధికారులు ప్రకటనలు చేసి పట్టణంలో ప్రతి దుకాణానికి నోటీసులు జారీ చేసినా క్షేత్ర స్థాయిలో అమలు శూన్యమని చెప్పవచ్చు. అధికారులు నామ మాత్రపు తనిఖీలు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వారపు సంత, కూరగాయల దుకాణాలు, కిరణా షాపులు, టిఫిన్ బళ్లు, పండ్ల దుకాణాల్లో ఎక్కడ చూసినా పాలిథిన్ వాడకం ఎక్కువగా కనిపిస్తోంది. కొవ్వూరు డివిజన్ పరిధిలోని నిడదవోలు, కొవ్వూరు మున్సిపాలిటీతో పాటు వివిధ మండలాల్లో ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉంది. వాటికి తోడు వాటర్ బాటిళ్ల వాడకం పెరగడంతో కాలువలు, రోడ్లపై ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు కుప్పతెప్పలుగా దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని కల్యాణ మండపాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, మద్యం దుకాణాల్లో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, కవర్ల వాడకం అధికంగా ఉంటోంది. పట్టణంలో రోజుకు 22 టన్నుల చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తారు. దీనిలో 2 టన్నుల ప్లాస్టిక్ ఉంటుందని అంచనా.

వినియోగించినా, విక్రయించినా చర్యలు



ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను అమ్మకం చేసినా, వినియోగించినా పర్యావరణ పరిరక్షణ చట్టం, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ రూల్స్ మేరకు క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు సంపూర్ణ నిషేధం దిశగా నిబంధనలు అమలు చేస్తున్నాం. షాపుల్లో ప్లాస్టిక్ విక్రయాలు జరిపినా, వినియోగించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు, ప్రజలకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు మార్కెట్‌కు వెళ్లేటప్పుడు గుడ్డ, నార సంచులు విధిగా తీసుకువెళ్లాలి. ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలి.

– కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్, నిడదవోలు

వైఎస్సార్ సీపీ శ్రేణులు తునికి తరలి రావాలి



తానేటి వనిత, రాష్ట్ర హోం శాఖ మాజీ మంత్రి

దేవరపల్లి: తుని మున్సిపాల్ వైస్ చైర్మన్ ఎన్నికను కూటమి ప్రభుత్వం చట్ట విరుద్ధంగా జరుపుతుందని మాజీ హోం శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గం సమన్వయకర్త తానేటి వనిత అన్నారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను కిడ్నాప్ చేయడానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రను పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రను ఖండిస్తూ, వైఎస్సార్ సీపీ నాయకులు, కౌన్సిలర్లకు సంఘీభావంగా ఉండడానికి మంగళవారం చలో తుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు, అనుబంధ కమిటీల అధ్యక్షులు, కార్యకర్తలు చలో తుని కార్యక్రమానికి తరలి రావాలని ఆమె పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు తుని చేరుకోవాలని ఆమె తెలిపారు.

యువకుడి సెల్ఫీ కలకలం

- ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వీడియో చిత్రీకరణ
- వాట్సాప్ ద్వారా పలువురికి చేరవేత

కొవ్వూరు: బంగారమ్మ పేట గ్రామానికి చెందిన యర్రంశెట్టి సతీష్ అనే యువకుడు తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని సోమవారం పెట్టిన సెల్ఫీ వీడియో కలకలం రేపింది. మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో వీడియో తీసుకొని స్నేహితుడికి పంపాడు. దీంతో బంగారమ్మపేటలోని యువకుడి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. ఈ యువకుడు ఇటీవల కాలంలో ఆన్‌లైన్ గేమ్స్‌తో సొమ్ము పోగొట్టుకుని అప్పులపాలయ్యాడు. దీంతో మనస్తాపం చెంది బీచ్‌లో వీడియో తీసుకుని తన స్నేహితుడు, బంధువులకు వాటాప్స్‌లో పంపించాడు. ఈ వ్యవహారంపై మొగల్తూరు పోలీసులు బీచ్‌లో గాలించగా ఆ యువకుడి మోటారు సైకిల్, సెల్‌ఫోన్ లభించినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మృతుడి కుటుంబానికి పరామర్శ



తిమ్మాపురంలో సోమశేఖర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి వనిత

ద్వారకాతిరుమల: తిమ్మాపురంలో ఇటీవల వైఎస్సార్ సీపీ నాయకుడు గంటా సోమశేఖర్ మృతి చెందగా అతని కుటుంబ సభ్యులను మాజీ హోం మంత్రి తానేటి వనిత సోమవారం పరామర్శించారు. మృతుడి నివాసానికి వెళ్లిన ఆమె సోమశేఖర్ కుమార్తె కార్తికను దగ్గరకు తీసుకుని ఓదార్చారు. అలాగే కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి సోమశేఖర్ చేసిన సేవలను ఆమె కొనియాడారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు కారుమంచి రమేష్, బొండాడ వెంకన్నబాబు, భోగరాజు సాయికృష్ణ, బోళ్ల శ్రీను, వాసిరెడ్డి నరసింహరావు, అప్పసాని ధర్మారావు, పోలిన నారాయణరావు, వాసిరెడ్డి రామారావు, కండెపు కృష్ణారావు తదితరులు ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి



గోపాలపురంలో ఎమ్మెల్సీ ఓటరు జాబితా స్లిప్పులు అందజేస్తున్న తహసీల్దార్ అజయ్‌బాబు

గోపాలపురం: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ కె.అజయ్‌బాబు అన్నారు. ఈ నెల 27న జరిగే గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన గ్రాడ్యుయేట్లకు వారి ఓటరు స్లిప్‌లను వీఆర్వో, బీఎల్వోలకు సోమవారం తహసీల్దార్ అందజేశారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఓటరుకు సంబంధిత వీఆర్వో, బీఎల్ఓల ద్వారా ఇంటింటికీ స్లిప్పులు అందజేస్తారన్నారు. మూడు బూత్‌లకు గానూ 1,790 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు పీవీ సాంబశివరావు, కాట్రు నల్లరాజు, వీఆర్వోలు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేపై ర్యాలీ



చిన్నాయగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

దేవరపల్లి: చిన్నాయగూడెంలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వేపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూ సర్వే ప్రాజెక్టులో భాగంగా గ్రామంలో రీసర్వే జరుగుతోందన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించడానికి గ్రామంలో సదస్సు, ర్యాలీ నిర్వహించామన్నారు. చిన్నాయగూడెంలో 4198.95 ఎకరాల భూములు ఉండగా, 599 సర్వే నెంబర్లు, 1700 మంది రైతులు ఉన్నట్టు వెల్లడించారు. ఇప్పటి వరకు మండలంలోని పల్లంట్ల, కురుకూరు, గౌరీపట్నం, కొండగూడెం, దుద్దుకూరు, లక్ష్మీపురం, ధుమంతునిగూడెం గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యిందన్నారు. రైతులు సర్వే బృందానికి సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, మండల సర్వేయర్ దిల్లేష్, మాజీ ఎంపీపీ గడా మురళీ అజిత్ కుమార్, వీఆర్వోలు ఎం.రాంబాబు, యు.పద్మ, జి.శేషుకుమార్, పండుబాబు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంలో మేము సైతం



నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆర్గానిక్ కూరగాయల స్టాల్

నల్లజర్ల: వారందరూ గృహిణులు. ఒక వైపు ఇంటి పనులు చూసుకుంటూనే మరో వైపు ప్రకృతి వ్యవసాయ సేద్యంపై దృష్టి సారించారు. నేచురల్ ఫార్మింగ్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్‌తో పాటు పీఆర్పీలు, సీఆర్పీల సాయంతో తమకున్న కొద్దిపాటి భూమిలోనే ప్రకృతి సిద్ధంగా కూరగాయలు, ఆకుకూరలను పండిస్తున్నారు. తక్కువ ఖర్చుతో పాటు నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్నారు. శింగరాజుపాలెం, పుల్లలపాడు, ముసుళ్లగుంట, మార్లెమూడి తదితర గ్రామాలలో మహిళలు ప్రకృతి సేద్యం ద్వారా పండించిన కూరగాయలను ఆయా గ్రామాలలో కావాల్సిన వారికి విక్రయిస్తూ మిగిలిన వాటిని ప్రతిసోమవారం మండల పరిషత్ కేంద్రంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో విక్రయిస్తున్నారు. వీటితో పాటు బియ్యం, బెల్లం, బొప్పాయి తదితర వాటినీ అమ్ముతున్నారు. ఉద్యోగులు, ప్రజలతో పాటు వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారు వీటిని కొనుగోలు చేస్తున్నారు. డ్రోన్ సాయంతో కూరగాయల పంటలపై కషాయాలు పిచికారీ చేస్తున్నట్టు మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ వివరించారు.

కదంతొక్కిన అంగన్‌వాడీలు

సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా



కొవ్వూరులో ఐసీడీఎస్ సీడీపీవో మమ్మికి వినతి పత్రం అందజేస్తున్న కార్యకర్తలు, ఆయాలు

కొవ్వూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు సీహెచ్ పుష్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర బాబు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు చేయాలని అనేక సార్లు విన్నవించుకున్నామన్నారు.ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాణిక్యాంబ మాట్లాడుతూ రానున్న బడ్జెట్‌లో అంగన్‌వాడీల సమస్యలపై చర్చించి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీడీపీవో డి.మమ్మికి వినతిపత్రం అందజేశారు.

పెరవలి: ప్రభుత్వాలు మారినా తలరాతలు మారటం లేదని గతంలో 42 రోజులు పాటు సమ్మె చేస్తే హామీలు అమలు చేస్తామని పాలకులు మాటిచ్చి నేటికీ అమలు చేయటం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీల గౌరవ అధ్యక్షులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీల కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా గుర్తించాలని కోరారు.

నరేష్ కుటుంబాన్ని ఆదుకుంటాం

నిడదవోలు: విద్యుదాఘాతానికి గురై పురుషోత్తపల్లి గ్రామానికి చెందిన దేశభక్తుల నరేష్ మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం నరేష్ మృతదేహాన్ని ఆయన పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. విద్యుత్ శాఖ తరపున మృతుని కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఇసుక ర్యాంపుల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

ఆర్డీవో రాణి సుస్మిత



కొవ్వూరు: ఇసుక ర్యాంపుల్లో నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించబోమని ఆర్డీవో రాణి సుస్మిత పేర్కొన్నారు. సోమవారం రాత్రి కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ఇసుక ర్యాంపుల నిర్వాహకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇసుక లారీలు నిర్థేశిత బిల్లు కంటే రెట్టింపు లోడుతో వెళుతున్నాయని అటువంటి వాహనాలపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. లారీలపై కేసు నమోదు చేయడంతో పాటు రూ.47 వేలు అపరాధ రుసుము కింద వసూలు చేస్తామన్నారు. ఆయా ర్యాంపు నిర్వాహక సొసైటీ నుంచి రూ.50వేల అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు. డ్రెజ్జింగ్‌కు ఏవిధమైన అనుమతి లేదన్నారు. రాజమహేంద్రవరం టాస్క్‌ఫోర్సు బృందం కొవ్వూరు వైపు, కొవ్వూరు డివిజన్ టాస్క్‌ఫోర్సు బృందం రాజమహేంద్రవరం వైపు తనిఖీలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇసుక ర్యాంపుల్లో సీసీ కెమెరాలు కచ్చితంగా పని చేయాలన్నారు. ఓపెన్ రీచ్‌లో యంత్రాలు వినియోగిస్తే చర్యలు తప్పవన్నారు. ఉచిత ఇసుక నిమిత్తం వచ్చే ట్రాక్టర్‌లు, ఎండ్ల బళ్లకు ఏవిధమైన ఆటంకాలు సృష్టించవద్దని సూచించారు. ఓపెన్ రీచ్‌ల్లో నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే ఇసుక తవ్వకాలు చేయాలని సూచించారు. పడవ సాయంతో నడిచే ర్యాంపులు బుధవారం లేదంటే గురువారం నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ(నారాయణ), మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, అనమరెడ్డి సత్తిబాబు, వట్టికూటి వెంకటేశ్వరరావు, పాకా జయరామ్, సీహెచ్ సాయికృష్ణ, లంకదాసు శ్రీనివాసరావు, ముళ్లపూడి కాశీ విశ్వనాథ్, బర్ల శ్రీనివాస్, గెల్లా సురేష్, జీజీ చలం తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేలో అలసత్వం వద్దు

జేసీ చిన్నరాముడు



ఖండవల్లిలో భూముల రీ సర్వేపై అధికారులతో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

పెరవలి: భూముల రీ సర్వే విషయంలో అధికారులు నిబద్ధతతో పని చేయాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్నరాముడు హెచ్చరించారు. పెరవలి మండలం ఖండవల్లి గ్రామంలో సోమవారం రీ సర్వే పై అధికారులతో సమీక్ష నిర్వహించి, క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఖండవల్లిలో రీ సర్వే కోసం 11 టీమ్‌లు ఏర్పాటు చేసి 4 రోవర్స్ ఇచ్చినా టార్గెట్ పూర్తి చేయటం లేదని అసంతృప్తి వెలిబుచ్చారు. ఇలా అయితే ఎప్పటికి రీ సర్వే పూర్తి చేస్తారన్నారు. రీ సర్వే అంటే భూ సమస్యల పరిష్కారమే కాదని, ఇందులో రైతులను భాగస్వాములుగా చేసినప్పుడే సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో 9 చోట్ల రీసర్వే జరుగుతుందని అందులో 4 పెద్ద గ్రామాల్లో రీసర్వే చేపట్టామన్నారు. దేవరపల్లి, నల్లజర్ల, నిడదవోలు, ఖండవల్లి గ్రామాలలో భూమిని మూడు భాగాలుగా చేయటం జరిగిందని వీటిలో గ్రామకంఠం, పంట భూములు, ప్రభుత్వ భూములను గుర్తించటం జరుగుతుందని తెలిపారు. పంట భూములను సర్వే చేస్తున్నామని ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా పూర్తి చేయటం జరుగుతుందని తెలిపారు.

సేవలను సద్వినియోగం చేసుకోండి

ఉండ్రాజవరం: బౌద్ధధమ్మ పీఠం ఆధ్వర్యంలో నిర్వహించే విద్యా, వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బౌద్ధ ధమ్మ పీఠాధిపతి భంతె అనాలియో కోరారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉండ్రాజవరంలో బౌద్ధధమ్మ పీఠం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 97 మందికి పరీక్షలు చేసి, వారిలో 35 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించడంతో పాటు 42 మందికి కళ్లజోళ్లు, మిగిలిన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనాలియో మాట్లాడుతూ ప్రతి నెల మూడో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరంతో పాటు డెంటల్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కంటి వైద్య నిపుణులు ఎస్.కె.కరీం, గన్నమని వెంకట సుబ్రహ్మణ్యం, బూరుగుపల్లి కళారావు, మల్లిన సత్యనారాయణ, మల్లిన శ్రీను, ఘంటా వెంకట్రావు, ఆప్టీషియన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నేడు నిలిపివేత

పెరవలి: పెరవలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఈఈ ఎన్ నారాయణ అప్పారావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పెరవలి, కాకరపర్రు, ముక్కామల, తీపర్రు, ఖండవల్లి, నల్లాకులవారిపాలెం, కాపవరం, మల్లేశ్వరం, అజ్జరం, వెంకట్రాయపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

దేవరపల్లి: యర్నగూడెం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ హెచ్‌క్యూ ఫీడర్ ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. హెచ్‌క్యూ ఫీడర్‌పై ఉన్న గృహ, వాణిజ్య, ఇండస్ట్రీయల్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మహాశివరాత్రి ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

దేవరపల్లి: పల్లంట్లలో ఉన్న రాజరాజేశ్వరి సమేత దుర్గామల్లేశ్వర స్వామి మహాశివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని సోమవారం ఆలయం వద్ద కమిటీ సభ్యులు కూచిపూడి సతీష్, బలుసు సత్యనారాయణ, కొయ్యలమూడి సురేంద్రనాథ్ ఛటర్జీ, ఈడుపుగంటి శివరాం ప్రసాద్, మొక్కపాటి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, ఉపసర్పంచ్ కూచిపూడి సతీష్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 26వ తేదీ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెల్లవారు జామున 3 గంటల నుంచి 5 గంటల వరకు అభిషేకాలు, అనంతనం భక్తులకు స్వామి వారి దర్శనం ఉంటుందన్నారు. రాత్రి 8 గంటలకు దోర్బాల ప్రభాకరశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం, రాత్రి 9 గంటల నుంచి లింగోద్భవ కాలం వరకు స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతుందన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి వీర రాఘవుల గెలుపునకు కృషిచేద్దాం

నిడదవోలు రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులను గెలిపించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు జువ్వల రాంబాబు విజ్ఞప్తి చేశారు. మండలంలోని సమిశ్రగూడెం, శెట్టిపేట, పురుషోత్తపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు.